# జలకాలాటలు

కె.వి.ఎస్.వర్మ

గోదావరి గలగలా ప్రవహిస్తోంది. ధార్మినార్ ఘుమఘుమలాడడం లేదు.

" కవి కుమారుడింకా రాలేదేంటి "

'కవి కుమారుడింకా రాలేందేంటి" అని కథ్రాజు అప్పటికే రెండు మూడు సార్లు అన్నాడు.

"కథ్రాజుకి కవి కుమారుడంటే చాలా యిష్టం"


"కాదని ఎవరన్నారు"

"అస్తమానం వాదించుకుంటారు కదా"

"వాళ్లది భార్యాభర్తల సంబంధం" అన్నాడు జగదీష్ నవ్వుతూ.

"అంటే"

"అస్తమానం కీచులాడుకుంటారు. మళ్లీ అంతలోనే కలిసి పోతుంటారు కదా" అన్నాడు జగదీష్.




"ఏటిలోని కెరటాలు ఏరు విడిచి పోవు ఎదలోపలి మమకారం ఎక్కడికీ పోదు" అంటూ పాట అందుకున్నాడు కొటేషన్‌రావు.

పాట పూర్తయ్యేటప్పటికి కవికుమారుడు వచ్చి గోదావరి గట్టు గచ్చు చప్టా మీద మిత్రుల దగ్గర కూర్చున్నాడు.

శాస్త్రి గొంతు సవరించుకున్నాడు.

"కెరటాలంటే గుర్తొచ్చింది. కొన్నాళ్ల క్రితం విశాఖపట్నం వెళ్లేను. అప్పుడే హైదరాబాద్ నుంచి కూడా మరో మిత్రుడు వచ్చాడు. దాంతో అక్కడి మా ఫ్రెండ్స్ లాడ్జిలో రూమ్ తీసుకున్నారు. మనదేశంలో వన్‌డే ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్‌లు కూడా జరుగుతున్నాయి. అవేళ మన దేశం ఆడుతోంది.

టి.వి.లో క్రికెట్ చూస్తూ బీర్ బాటిల్స్ ఓపెన్ చేశాం. దెబ్బకి ఎండ ముఖం మాడ్చుకుంది. ప్రభాకర్ అవుటయ్యాడు.

సుధాకర్ చప్పట్లు కొట్టాడు. మేం అతని వంక ఆశ్చర్యంగా చూశాం.

"లేచి నిలబడి బాటిల్లో మిగిలిన బీర్ గటగటా తాగేసి,

"ఫ్రెండ్స్. చూడండి. ఇవేళ మనం ఓడిపోతాం. పందెం" అన్నాడు సుధాకర్.

"మనమే గెలుస్తాం" పందెం అన్నాడు రావు.

"ఎంత"

"రాత్రి సిటింగ్ ఖర్చు"

"ఓ.కె."

ఇంక మా గదిలోనే క్రికెట్ ఆట జరుగుతున్నంత హడావుడి.

అప్పటికే తలో బీర్ బాటిల్ తాగేశాం. రెండో బీర్‌లోకొచ్చేశాం.

మన టీమ్‌లో ఎవరెవరున్నారో ఇప్పుడు నాకు సరిగా గుర్తు లేదు. మన వాడెవడైనా ఫోరో, సిక్సో కొడితే రావు డ్యాన్స్ చేసేవాడు. మనవాడెవడైనా అవుటయితే సుధాకర్ "రామ రామ రామ" అంటూ భజన చేసేవాడు.

ఎట్టకేలకు, తుట్టతుదకు మనమే ఓడిపోయాం.

"అజారుద్దీన్ మన కెప్టెన్‌గా వున్నంతకాలం ఇలాగే జరగాలి" అన్నాడు సుధాకర్.

అతను అయోధ్య సరుకని నాకర్థమయిపోయింది.

కాసేపు పేకాడి, ముఖాలు కడుక్కున్నాం. చిన్న కునుకు కూడా తీశాం. ఏడున్నరకి లేచి కూచున్నాం.

వేట్-69 ఓపెన్ చేశాడు రావు.

"ఏమి జన్మము ఏమి జీవనము ఓ మాయ ఘటమా" అని బాటిల్ వంక చూస్తూ విషాదంగా రాగం తీశాడు రావు. ఆ బాటిల్ రావు కొన్నదే మరి.

మధ్య మధ్యలో చికెను పకోడీలు తింటూ వేట్-69 నెమ్మదిగా లాగించేశాం. రాత్రి తొమ్మిది దాటింది. భోంచేశాం.

"ఇప్పుడు బీచ్ కెళ్లాలి" అన్నాడు రావు గోల్డ్ ఫ్లేక్ కింగ్ సిగరెట్ వెలిగిస్తూ.

"ఇప్పుడా" అన్నాను నేను ఆశ్చర్యంగా.

"ఇప్పుడే, ఏం" అన్నాడు రావు నన్ను ఎగాదిగా చూసి.

నేను మౌనమే భూషణమనుకున్నాను.

ఆఖరికి బీచ్‌కెళ్లక తప్ప లేదు. భీమిలి వెళ్లే రోడ్డు మీద కారులో చాలాదూరం వెళ్లాం.

ఓచోట ఆగాం. రోడ్డుదిగిబీచ్‌లో కెళ్లాం.

రావు బట్టలిప్పి "రండ్రా రండి" అంటూ సముద్ర స్నానానికి రెడీ అయ్యాడు. మేం కూడా గొర్రెల్లా వెళ్లాం. అయితే, ఎవరమూ సముద్రంలోపలికి వెళ్లలేదు.

అంతా చీకటి. కెరటాల నురగ మాత్రం కన్పిస్తోంది. ఇసక మసక మసకగా కనిపిస్తోంది.

పార్వతీశం గద్దర్ పాటలు పాడాడు. సుధాకర్ రామభజన చేశాడు. రావు మాల్గాడి శుభ పాటలేవో పాడాడు. మధ్యలో కబుర్లు. గోల.

అలా ఎంతసేపు స్నానాలు చేసేమో తెలీదు.

ఒళ్లు తుడుచుకోడానికేమీ పట్టుకెళ్లలేదుగా. బట్టలేసుకుని బయల్దేరాం.

రావూ, నేనూ లాడ్జిలో పడుకున్నాం. మిగతా వాళ్లు వాళ్ల ఇళ్ల కెళ్లిపోయారు.

బాగా ఎండెక్కాక లేచాం. తలనొప్పి దంచేస్తోంది. బీరూ, విస్కీ, కాక్ టైల్ అయ్యాయేమో.

టైమ్ ఎంతయ్యిందోనని వాచీ కోసం చూస్తే అది లేదు. నా గుండె రఝల్లుమంది.

"ఏమోయ్ సుధాకర్ టైమ్ ఎంతయ్యింది" అన్నాడు రావు.

"నేను సుధాకర్ కాదు. శాస్త్రిని" అన్నాను.

"ఆ టేబుల్ మీద నా కళ్లజోడు వుంటుంది కాస్త చూడండి" అన్నాడు రావు.

చూశాను. లేదు. రావు ముఖం పాలిపోయింది.

"ఏవయ్యుంటుంది. కళ్లజోడు లేకపోతే నాకేమీ సరిగా కనిపించి చావదు"

"నా వాచీ కూడా లేదు. బహుశా రాత్రి బీచ్‌లో వదిలేసి వుంటాం"

"అలాగా. చచ్చేం. ఇప్పుడెలాగ?" అన్నాడు కళ్లు మూసుకుని, గోడకుజారబడి.

అంతలో పార్వతీశం మిగతా మిత్రులూ వచ్చారు.

"రాత్రి బలే జరిగింది బాస్" అన్నాడు.

వాచీ, కళ్లజోడు గురించి చెప్పాను.

'మీవీ పోయాయా? నా పర్సు పోయింది. రఘు బూట్లు పోయాయి. ఇందాకే బీచ్‌కెళ్లి వెదికాం. ఏదీ కనిపించలేదు"

"ఏవయ్యుంటాయి?"

"మనం రోడ్డు దిగి సముద్రం దగ్గరికెళ్తున్నప్పుడు మన వరస ఎవరన్నా గమనించి వుంటారు"

"నాకు కళ్ల జోడు లేకపోతే నేను బయటికి రాలేను. వెంటనే డాక్టర్ దగ్గరికెళ్తాను. ఇవేళే కళ్లజోడు ఇచ్చే నీకు తెలిసిన షాపుంటే చూడు" అన్నాడు రావు.

"నేను మావూరెళ్లాక డబ్బులు పంపుతాను. అర్జంటుగా నాకో ఎనిమిది వందలు చూడు. ఇంటి ఖర్చుకని ఇచ్చిన డబ్బుల్లో కొంచెం కొంచెం మిగిల్చి మా ఆవిడ వారం రోజుల క్రితమే ఆ టైటాన్ వాచీ నాకు బర్త్‌డే గిఫ్ట్‌గా ఇచ్చింది. అది నా చేతిని లేకపోతే చాలా ప్రమాదాలు జరుగుతాయి అన్నాను. ఆరోజే అదే మోడల్ వాచీ కొన్నాను." అంటూ ఎడం చెయ్యి పైకెత్తి టైటాన్ వాచీలో టైము చూశాడు శాస్త్రి.

తొమ్మిదయ్యింది. అంతా లేచాం.

కొటేషన్‌రావు ఆకాశంలోని చందమామ చూస్తూ అన్నాడు.

"మందుతో సర్వం మటాష్"

(వచ్చేవారం: లేట్ మాస్టర్)

## కట్టగట్టుకుని దూకడంలో రికార్డ్



'కట్టగట్టుకు దూకండి!' అన్న మాట తెలుగు వారికి చిరపరిచితమే. ఫిన్‌లాండ్‌లో ఇటీవల జరిగిన ఒక ఉత్సవం సందర్భంగా ఒక అంతర్జాతీయ సంస్థ వారు ఈ మాటనే నిజం చేసి చూపించారు. అక్కడ జరిగిన హెలిన్ స్కీ వాటర్ ఫెస్టివల్ పలువురిని ఆకర్శించింది. ఈ ఉత్సవం సందర్భంగా ఫీట్ స్కై బ్రేకర్స్ క్లబ్ సంస్థ సభ్యులు పన్నెండు మంది ఒకే ఒక తాడుకు కట్టగట్టుకుని ఎంతో ఎత్తునుండి కిందకు దూకేశారు. గ్రూప్ జంపింగ్‌లో ఇలా కట్టగట్టుకుని దూకడంలో ఇదే ప్రపంచ రికార్డ్.